ఆంధ్రజ్యోతి

andhrajyothy.com | శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3, కనిష్ఠం 24.2

నిజామాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 10 ఆగస్టు 2024



అవినీతి అనకొండ ఇతనే..!



• ఏసీబీ అధికారుల తనిఖీల్లో నగదుతో పట్టుబడ్డ నరేందర్



మొక్కలు నాటుతున్న కలెక్టర్ రాజీవ్, ఎమ్మెల్యే ధన్‌పాల్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- స్వచ్ఛదనం - పచ్చదనంలో భాగంగా మొక్కల పంపిణీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ దండు నీతూకిరణ్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం నగరంలోని చంద్రశేఖర్ కాలనీలో పర్యటించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కాలనీలో ఇంటింటికి తిరుగుతూ మొక్కలను పంపిణీ చేశారు. పరిసరాలను పరిశీలిస్తూ అక్కడక్కడ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగి ఉండటాన్ని గమనించి కలెక్టర్ పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవుపలికారు. అప్పుడే విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారి నుంచి కాపాడుకోగలుగుతామని అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు అధ్యక్షతన క్విట్ ఇండియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు జాతీయ జెండాను ఆవిష్కరించగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో బ్రిటిష్ పాలనను అణచివేసేందుకు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు మహాత్మాగాంధీ 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారని ఆ ఉద్యమం ద్వారా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంతరెడ్డి రాజరెడ్డి, ముప్ప గంగారెడ్డి, మీసాల సుధాకర్‌రావు, రాంభూపాల్, సంతోష్, గంగారెడ్డి, ఈసా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: ధైర్య సాహసాలు ప్రదర్శించి ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థలకు 2025 సంవత్సరానికి గాను ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మహిళా శిశుసంక్షేమ దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభాపాటవాలు, ఆటలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్య సాహస కార్యక్రమాలు తదితర అంశాలకు ఈ అవార్డును భారత ప్రభుత్వం ప్రదానం చేస్తుందని 5 నుంచి 18ఏళ్లలోపు బాలబాలికలు దరఖాస్తులకు అర్హులన్నారు. అవార్డ్స్.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్పొరేషన్‌లో

కలకలం

- నగర మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ నరేందర్ ఇంట్లో ఏసీబీ సోదాలు
- రూ.6కోట్ల 7లక్షల 81వేల విలువైన ఆస్తులు సీజ్
- నరేందర్‌ను అరెస్టు చేసి.. హైదరాబాద్‌కు తరలింపు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన తనిఖీలు
- ఏసీబీ తనిఖీలతో మున్సిపల్ కార్పొరేషన్‌లో మొదలైన అలజడి



నిజామాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/సుభాష్‌నగర్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్, ఇన్‌చార్జీ రెవెన్యూ అధికారి దాసరి నరేందర్ ఇంట్లో ఏసీబీ అధికారుల దాడులు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే సమాచారంతో శుక్రవారం ఏసీబీ అధికారులు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారి ఇంటితో పాటు కార్యాలయం, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. భారీ స్థాయిలో నగదుతో పాటు బంగారం, ఆస్తుల వివరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న కేసులో ఆయనపై కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని ప్రకటించారు. ఒకేసారి నాలుగు చోట్ల ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టడంతో మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొనగా భారీగా ఆస్తులు, నగదు బయటపడటంతో విస్మయం చెందారు. చాలా ఏళ్లపాటు ఒకేచోట పనిచేయడం బదిలీ చేసిన వేరే ప్రాంతానికి వెళ్లకపోవడం ఏసీబీ అధికారులకు అందిన సమాచారంతో ఈ దర్యాప్తును చేపట్టినట్లు అధికారులు ప్రకటించారు.



స్వాధీనం చేసుకున్న నగదుతో ఏసీబీ అధికారులు

ఏకకాలంలో తనిఖీలు

నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లోగల నరేందర్ ఇంటితో పాటు ఆయన పనిచేస్తున్న నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కోటగల్లి, నిర్మల్‌లోని బంధువుల ఇండ్లల్లో ఏకకాలంలో ఈ తనిఖీలను కొనసాగించారు. భారీ ఎత్తున నగదు, బంగారం, ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన 25 మంది ఏసీబీ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలను చేపట్టారు. ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ఆయనకు వచ్చిన సమాచారం ఆధారంగా ఆదాయానికి మించి అస్తులు ఉన్నాయని సమాచారంతో ఈ తనిఖీలను చేశారు. ఆయన వద్ద రెండు కోట్ల 93లక్షల 81వేల రూపాయల నగదు దొరికింది. నరేందర్ బ్యాంకు ఖాతాల్లో ఒక కోటి 10లక్షల బ్యాలెన్స్‌ను గుర్తించారు. ఆయనకు సంబంధించి 51 తులాల బంగారు ఆభరణాలతో పాటు 17 స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో మొత్తం 6కోట్ల 7లక్షల 81వేల రూపాయల విలువైన ఆస్తులు సీజ్ చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న నరేందర్‌ను అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ ప్రకటించారు. ఆయనను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

ఉదయం 5గంటల నుంచి తనిఖీలు

నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఆయన ఇంటికి ఉదయం 5గంటలకు చేరుకున్న ఏసీబీ అధికారులు మొదట ఇంటిలో తనిఖీ చేపట్టారు. అదే సమయంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మరో బృందం చేరుకొని ఫైళ్లను తనిఖీ చేశారు. కార్యాలయంలో కూడా 90వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఆయన బంధువుల ఇళ్లు కోటగల్లితో పాటు నిర్మల్‌లో తనిఖీలు చేసిన ఈ రెండు చోట్ల ఎలాంటి ఆస్తులకు సంబంధించిన వివరాలు దొరకలేదు. మున్సిపల్ కార్పొరేషన్‌లో దీర్ఘకాలికంగా సూపరింటెండెంట్‌గా పనిచేస్తూనే రెవెన్యూ అధి కారిగా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఏళ్ల తరబడి ఒకే

కార్పొరేషన్‌లో మొదలైన అలజడి..

నరేందర్ ఇంటిపై ఏసీబీ తనిఖీలు మొదలయ్యాయని తెలవగానే కార్పొరేషన్ ఉద్యోగుల్లో అలజడి మొదలైంది. నరేందర్ ఇంటికి ఉదయం 5గంటలకే ఏసీబీ అధికారులు చేరుకుని తనిఖీలు మొదలు పెట్టడంతో కార్పొరేషన్ ఉద్యోగులు సమయానికి చేరుకున్నారు. ఏసీబీ అధికారులు కార్యాలయానికి వచ్చి తనిఖీలు చేయడంతో ఇతర శాఖల అధికారులు కూడా భయాందోళనకు గురయ్యారు. కార్యాలయంలో నరేందర్ పనిచేస్తున్న చాంబర్ మాత్రమే పరిశీలించి వెళ్లడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్ల నుంచి భవనాల అనుమతుల వరకు ఎక్కువ సంఖ్యలో నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగుతున్నాయి. కొన్ని భవనాలు కార్పొరేషన్ పరిధిలోని మాస్టర్ ప్లాన్‌కు భిన్నంగా అనుమతులు ఇస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు.

చోట పనిచేయడం అన్నీ తానై వ్యవహరించడం బోధన్‌కు బదిలీ చేసినా వెళ్లకుండా ఇక్కడే కొనసాగుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో అనుమతులు, రిజిస్ట్రేషన్‌లు, ఇంటి నెంబర్ల కేటాయింపునకు సంబంధించిన అనుమతుల్లో ప్రమేయం ఉండటం.. గత కొంత కాలంగా ఆయనపై ఫిర్యాదులు పెరగడం ఉన్న తాధి కారులకు నివేదించినా పట్టించుకోకపోవడంతో కొంత మంది ఏసీబీ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు నాలుగు టీమ్‌లుగా విడిపోయి ఈ తనిఖీలను చేపట్టారు.

భారీగా నోట్ల కట్టలు

తనిఖీల్లో భారీ ఎత్తున నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ నోట్ల లెక్కింపున కు అధికారులు రెండు కౌంటింగ్ మిషన్‌లను కూడా తీసుకువచ్చి లెక్కించారు. ఉదయం 5 గంటలకు తనిఖీలు మొదలు పెట్టిన అధికారులు సాయంత్రం 5గంటల వరకు ఈ తనిఖీలు చేశారు. సుమారు 12 గంటల పాటు తనిఖీలను చేపట్టారు. ఇల్లుతో పాటు బ్యాంకు లాకర్‌లను పరిశీలించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పూర్తిస్థాయిలో ఆయన చాంబర్‌ను తనిఖీ చేశారు. ఈ మధ్యన జరిగిన లావాదేవీలన్నీ పరిశీలించారు. జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున డబ్బులు పట్టుబడటం ఇదే మొదటి సారి అని ఏసీబీ అధికారులతో పాటు ఇతర అధికారులు తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున ఏ అధికారి వద్ద కూడా నగదు బయటపడలేదు. తనిఖీలకు వచ్చిన అధికారులు కూడా పెద్ద ఎత్తున నగదు దొరకడం చూసి ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇంత పెద్ద డబ్బును ఆయన ఇంటిలోనూ, బ్యాంకు లాకర్‌లోనూ ఎలా ఉంచారో ఆయనను ప్రశ్నించి వివరాలను సేకరించినట్లు ఏసీబీ అధికారులు ప్రకటించారు.



నరేందర్ నివాసం ఉండే అపార్ట్‌మెంట్ వద్ద పోలీసులు

కార్పొరేషన్‌లోని పలు విభాగాల్లో అవకతవకలు

మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు విభాగాల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. చాలా వివాదాల్లో డబ్బులు ఇస్తే తప్ప.. పనులు కొనసాగడం లేదు. ఎక్కువ మొత్తంలో భవనాల అనుమతులకు పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. దీర్ఘకాలికంగా ఒకేచోట ఎక్కువ మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. రెవెన్యూ విభాగంతో పాటు టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల్లో కొనసాగుతున్నారు. వీరిని ఇతర ప్రాంతాలకు బదిలీలు చేసిన తిరిగి ఇక్కడికే వచ్చి పనిచేస్తున్నారు. కొంత మంది డిప్యూటేషన్‌పై వస్తుండగా మరికొంత మంది అక్కడ పనిచేసి బదిలీపై వచ్చి కార్పొరేషన్‌లో కొనసాగుతున్నారు. బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వేసిన కొన్ని రోజుల పాటు సెలవులు పెట్టి మళ్లీ ఇక్కడికే వచ్చి కొనసాగుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల్లో సహకారం తీసుకొని పనులు చేయిస్తున్నారు. బదిలీపై వెళ్లకుండా దీర్ఘకాలికంగా ఒకేచోట కొనసాగుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రజాప్రతినిధుల ద్వారా మేనేజ్ చేసి ఇక్కడే కొనసాగుతున్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న అధికారి ఇంట్లో తనిఖీల్లోనే ఆదాయానికి మించి ఆస్తులు బయటపడ్డాయి. ఏసీబీ అధికారులు మరికొంత మంది ఉద్యోగులపై కూడా నజర్ పెట్టినట్లు సమాచారం.

కాగా, మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ ఇంట్లో అర్ధరాత్రి వరకు ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగాయి.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

- జిల్లాలో ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పుట్టల వద్ద మహిళల పూజలు
- పుట్టలో పాలుపోసిన భక్తులు



జిల్లావ్యాప్తంగా నాగుల పంచమి పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాల్లో కొలువుదీరిన నాగదేవతలతోపాటు, పుట్టల వద్ద భక్తులు పాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి శివలింగాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్, బోధన్ డివిజన్ ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి పాముల పుట్టల వద్ద బారులుతీరి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. - నిజామాబాద్ నెట్‌వర్క్



నగరంలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



• పెర్కిట్‌లో..




• నవీపేట్‌లో..



• ఎడపల్లిలో..

ఆయకట్టుకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, ఆగస్టు 9: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాం సాగర్‌ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటల కోసం ప్రధాన కాలువలు కాకతీయ, లక్ష్మీ, సరస్వతి కాలువలకు నీటి విడుదల కొన సాగుతోందని ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 3793 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా వచ్చిన నీటిని ప్రాజెక్టు ప్రధాన కాలువలకు తాగునీరు కోసం మిషన్ భగీరథకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 502, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీ)లు కాగా శుక్రవారం సాయంత్రానికి 1080.8అడుగులు (47.25టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1090.00అడుగులు (76.894టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతల నుంచి ప్రాజెక్టులోకి 43 టీఎంసీల వరదనీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ప్రవహిస్తున్న నీరు

ఐడీసీఎంఎస్ నూతన చైర్మన్‌ను కలిసిన నాయకులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 9 : నూతనంగా ఎన్నికైన ఐడీసీఎంఎస్ చైర్మన్ భగవత్‌తారచంద్ సింగ్‌నాయక్‌ను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. శుక్రవారం ఐడీసీఎంఎస్ చైర్మన్ భగవత్‌తారచంద్ సింగ్‌నాయక్‌ను అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీఎంపీపీలు అప్పాల పెద్దరాజన్న, కె.అనంత్‌రెడ్డి కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ జితేందర్‌నాయక్, జక్రాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగరపాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతోపాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

సీపీజెట్ ఎంట్రన్స్‌లో ఇందూరువాసికి మొదటిర్యాంక్


నిహారిక

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9 : ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన సీపీజెట్ ఎమ్ఎస్‌సీ డాటా సైన్స్- 2024 ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో ఇందూరువాసికి మొదటిర్యాంక్ వచ్చింది. ఇటీవల జరిగిన పరీక్షలో తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి ర్యాంక్‌ను నిజామాబాద్ పట్టణం జెండాగల్లికి ఎందిన మంచిర్యాల బ్రహ్మం, వనజ దంపతుల కుమార్తె అయిన మంచిర్యాల నిహారిక రాష్ట్ర స్థాయిలోనే మొట్టమొదటి ర్యాంక్ సాధించింది. నిహారిక తండ్రి బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వలస వెళ్లాడు.

నవీపేటలో కొండచిలువ మృతి


నవీపేటలో జేసీబీ తగిలి మృతిచెందిన కొండచిలువ

నవీపేట, ఆగస్టు 9 : మండలకేంద్రంలోని లింగమయ్య గుట్ట సమీపంలో అలీసాగర్ కాలువపై నూతనంగా వంతెన నిర్మాణం కోసం సంబంధిత స్థలాన్ని జేసీబీతో చదును చేయించారు. ఈ సమయంలో పొదల్లో ఉన్న భారీ సైజు కొండ చిలువకు జేసీబీ తగలడంతో అది తీవ్రంగా గాయపడి మృతి చెందింది. సంబంధిత కొండ చిలువ సుమారు 12ఫీట్ల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. నాగుల చవితి రోజున కొండచిలువ మృతిచెందడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

సైబర్ నేరగాళ్ల 'వాట్సప్ కాల్'

నవీపేట, ఆగస్టు 9 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి సైబర్ నేరగాళ్లు ఇటీవల వాట్సప్ కాల్‌చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మండలంలోని నాగేపూర్, సిరన్‌పల్లిలకు చెందిన పలువురికి సైబర్ నేరగాళ్లు వాట్సప్ కాల్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా శుక్రవారం మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోరే గంగాధర్ అనే వ్యక్తికి వాట్సప్ కాల్ చేసి అతని కుటుంబ సభ్యుల వివరాలను అడిగాడు. దీంతో అప్రమత్తమైన కోరే గంగాధర్ సైబర్ నేరగాడికి ఫోన్‌లో గట్టిగా సమాధానం ఇవ్వడంతో ఫోన్ కట్ చేశాడు. సైబర్ నేరగాడు పోలీస్ యూనిఫామ్ ధరించి ఉన్న ఫోటోను డీపీగా పెట్టుకున్నాడని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోగా సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

నిందితురాలి రిమాండ్

నవీపేట, ఆగస్టు 9 : నిజామాబాద్ మండలం జలాల్‌పూర్‌కు చెందిన ఈర్నాల సావిత్రి అనే నిందితురాలిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించడం జరిగిందని ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. గతనెల 25న అదే గ్రామానికి చెందిన గైనిశెట్టి గంగవ్వతో కుక్కర్ కొనుగోలు విషయంలో గొడవ జరిగిందని దీంతో సావిత్రి గంగవ్వ తలపై కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడిందని ఎస్ఐ తెలిపారు. ఈ విషయంపై అదేరోజు సావిత్రిపై హత్యాయత్నం కేసు నమోదు చేయగా శుక్రవారం నిందితురాలు సావిత్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ వివరించారు.

ఆర్థిక సహాయం అందజేత

ముప్కాల్, ఆగస్టు 9 : మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన ఆశవర్కర్ న్యాకపులక్ష్మీ మూడురోజుల క్రితం రోడ్డుప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి అనుచరుల ద్వారా అందజేశారు. మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైనట్టు తెలుసుకున్న సునీల్‌కుమార్ నిరుపేద కుటుంబమైన లక్ష్మీ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

మొక్కలు నాటి.. సంరక్షించాలి

● జిల్లా అదనపు న్యాయాధికారి రవికుమార్


కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారి

బోధన్‌రూరల్, ఆగస్టు 9 : మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని జిల్లా అదనపు న్యాయమూర్తి రవికుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారి, న్యాయవాదులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం యొక్క అవశ్యకతను వివరిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. నాటిన మొక్కలను వృక్షాలుగా పెరిగే వరకు కాపాడడం, సంరక్షించడం మన అందరి బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బోధన్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోశెట్టి, కార్యదర్శి కోటేశ్వర్ రావు, ఎం.గంగారెడ్డి, సీహెచ్‌వీ.హన్మంత్ రావు, బానోత్ రమేష్, గౌసోద్దీన్, అదనపు ప్రభుత్వ న్యాయవాది రవీందర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య, సీనియర్ న్యాయవాదులు రాములు, గోపాల్ రెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్

కమ్మర్‌పల్లి, ఆగస్టు 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా గుర్తించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, అటవీశాఖ క్షేత్రాధికారి రవీందర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు బుచ్చిచల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీయూలో మండవ జన్మదిన సంబరాలు


టీయూలో మాజీ మంత్రి మండవ జన్మదిన వేడుకలు

డిచ్‌పల్లి, ఆగస్టు 9 : తెలంగాణ యూనివర్సిటీలో మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు, శుక్రవారం జన్మదినం సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు పుష్పల రవి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌లు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. పుష్పల రవి మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి మండవ ఎంతో కృషి చేశారని, ఎమ్మెల్యేగా, మంత్రిగా అభివృద్ధి చేసిన మండవ వెంకటేశ్వరరావు జననేతగా ఎదగారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొ.కనకయ్య, అధ్యాపకులు నాగరాజు, దత్తహరి, గంగాకిషన్, ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు శ్రీశైలం, రాజేందర్, నవీన్, శ్రీకాంత్, బాలాజీ, మహేందర్, మహేశ్, రవీందర్, నరేశ్, ధర్మవీర్ పాల్గొన్నారు.

బోధన్‌లో ఇరుపార్టీల మధ్య స్వల్ప ఘర్షణ

బోధన్‌రూరల్, ఆగస్టు 9 : బోధన్ పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్పఘర్షణ చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఇరుపార్టీల నాయకులు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వీరయ్య మాట్లాడుతూ ఇరుపార్టీల ఫిర్యాదులు తీసుకుని విచారణ చేపట్టామన్నారు.

రుణమాఫీ రాని రైతులకు న్యాయం చేయాలని వినతి

రెంజల్, ఆగస్టు9 : మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల రుణమాఫీకి అర్హులై ఉండి రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు చుక్కరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీకి అర్హులై ఉండి కూడా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ జరగకుండా నష్టపోయిన రైతులను ఆదుకుని వారికి సత్వరమే న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత బ్యాంకు అధిఆరులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లోగా నష్టపోయిన రైతుల వివరాలను సమర్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించడం జరిగిందని వారన్నారు. తక్షణమే స్పందించిన కలెక్టర్‌కు రెంజల్ మండల రైతుల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారన్నారు. కార్యక్రమంలో రెంజల్ మండల బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ స్వాతంత్ర వేడుకలకు టీయూ వలంటీర్లు

డిచ్‌పల్లి, ఆగస్టు 9 : న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం విద్యార్థులకు రావడం తెలంగాణ యూనివర్సిటీకే గర్వకారణమని టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలకు ఎంపికైన వలంటీర్లను రిజిస్ట్రార్ అభినందించారు. ఎంపికైన వారిలో వాలంటీర్లు, విజయశాంతి, జ్యోతి, (తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల,కామారెడ్డి), శివప్రసాద్, సాయిరాం, (గిరిరాజ్ కళాశాల)లకు దక్కడం సంతోకరమని, రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడం మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొ.రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి చంద్రకళ, సురేశ్, పాల్గొన్నారు.

రాంపూర్‌లో వన మహోత్సవం

డిచ్‌పల్లి, ఆగస్టు 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛదనం-పచ్చదనం నినాదంతో శుక్రవారం మండలంలోని రాంపూర్(డీ) గ్రామంలో ప్రభుత్వ అధికారులు, వృద్ధాశ్రమం వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ మొక్క నాటారు. అనంతరం పీడీ సాయాగౌడ్ మాట్లాడుతూ... ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ఇళ్ల ముందర నిల్వ నీటిని ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మోస్రా : మండలంలో గోవూర్, చింతకుంట, తిమ్మాపూర్, చే నెంబర్ తండా గ్రామాలతో పాటు మోస్రా మండల కేంద్రంలో స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా మోస్రా గ్రామ పంచాయతీ ప్రాథమిక వైద్య కేంద్రం ఆవరణలో మండల ప్రత్యేక అధికారి రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్నటువంటి పాత సామాన్ అన్ని డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గుంతలలో ఉన్న నీటిని తొలగించి శుభ్రం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల వైద్యఅధికారి వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఏఎన్ఎం విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ప్రీతం, కారోబార్లు రాము, కాశీరాం, బిల్‌కలెక్టర్ గంగాధర్, ఆశవర్కర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ధర్నా

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 9 : ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లి గ్రామాల్లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లిలో ప్రభుత్వ అసైన్డ్‌భూమి, ఇరిగేషన్ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, అదేవిధంగా పెర్కిట్‌లో విశాఖకాలనీలో 202సర్వే నెంబర్‌లో పాత నిమ్మలగార్డెన్ సమీపం వద్ద పెర్కిట్ బైపాస్ వద్ద, మామిడిపల్లిలోని 8వ వార్డులోని సాయిగార్డెన్ సమీపంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఇంటి నెంబర్‌లు కేటాయించి కబ్జా అయిన వాటిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకొని పెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డులు పెటాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, ద్యాగ ఉదయ్, ఆకుల శ్రీనివాస్, సుంకరి రంగన్న, కలిగోట ప్రశాంత్, రాజ్‌కుమార్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగిస్తే విద్యుత్ ఆదా

● ట్రాన్స్‌కో డివిజినల్ ఇంజనీర్ శ్రీనివాస్

నందిపేట, ఆగస్టు 9 : వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకుంటే విద్యుత్ ఆదా చేయవచ్చని నిజామాబాద్ ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ కెపాసిటర్లు బిగించడం వలన మోటార్లు తక్కువ కరెంట్‌ను తీసుకుంటుందని, దీని వలన మోటార్ల వైండింగ్ వేడి కాదని తెలిపారు. అంతే కాకుండా బోరు బావుల నుంచి మోటార్లు ఎక్కువ నీటిని తోడుతుందని చెప్పారు. అలాగే లోడు తగ్గి ట్రాన్స్‌ఫార్మర్ మీద భారం పడకుండా ఉంటుందని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

కోటగిరి, ఆగస్టు 9 : పొతంగల్ మండల కేంద్రంలోని చెరువులో పడి గంగవ్వ (60) అనే వృద్ధురాలు మృతిచెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గంగవ్వ మతిస్థిమితం లేదు. మూడురోజుల క్రితం చెరువు వైపునకు వెళ్లిన గంగవ్వ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. శుక్రవారం ఉదయం చెరువులో మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు సమాచారం అందించారు. మృతదేహన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం బోదన్ ఏరియా ఆసుపత్రికి తరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో జీవితంలో రాణించాలి

మెండోర, ఆగస్టు 9 : మండలంలోని పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాలలో కీ.శే. మనుగొండ శ్యామల జ్ఞాపకార్థం పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీలో ప్రథమ స్థానంలో పోచంపాడ్ బాలుర గురుకుల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం అంజయ్య, నోముల శ్రీనివాస్, బాలుర గురుకుల పాఠశాల చైర్మన్ అక్తర్, వ్యాయమ ఉపాధ్యాయులు సంజీవ్; క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలి'

బోధన్‌రూరల్,ఆగస్టు9: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశం కోసం మరో పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు వరదయ్యలు అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో ప్రస్తుతం కార్పొరేటర్ల అవినీతి రాజకీయ నాయకుల దోపిడీ గురవుతుందని ఆరోపించారు. అధికారంలో ఉన్న మోడీ సర్కార్ ఈ దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచి పెడుతున్నారని పేర్కొన్నారు. భూములు, గనులు, బ్యాంకులు, రైల్వే లైన్‌లు, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రక్షణ రంగాలను సైతం తమ అనుచరులకు ప్రైవేటుపరం పేరిట కట్టబెడుతున్నారని ఆరోపించారు.



నిర్మల్, ఆదిలాబాద్‌కు సెమీ డిలక్స్‌లు

● నిజామాబాద్ నుంచి మెదక్ మీదుగా జేబీఎస్‌కు సైతం

సుభాష్‌నగర్, ఆగస్టు 9: నిజామాబాద్ నుంచి నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్ నుంచి మెదక్ మీదుగా జూబ్లీ బస్టాండ్ వరకు నూతనంగా సెమీ డిలక్స్ బస్సులను ప్రారంభిస్తున్నట్లు డిపో-2 మేనేజర్ సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ డిపో-2 నుంచి ఆర్డినరి, ఎక్స్‌ప్రెస్, డిలక్స్ ప్రయాణికుల సౌకర్యార్థం ఉన్నాయని ఎక్కువ రద్దీ ఉన్నందువల్ల సెమి డిలక్స్ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. నిజామాబాద్ నుంచి ఉదయం 6గంటలకు బయలుదేరి 9.30లకు ఆదిలాబాద్ చేరుకుంటుందని తెలిపారు. నిజామాబాద్ నుంచి 9.45లకు బయలుదేరి మధ్యాహ్నం 1.16 నిమిషాలకు ఆదిలాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. నిజామాబాద్ నుంచి 6.30లకు బయలుదేరి 12.30లకు జెబీఎస్ చేరుకుంటుందని అన్నారు. ఉదయం 8గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరి 2గంటలకు జెబిఎస్ చేరుకుంటుందని తెలిపారు. నిజామాబాద్ నుంచి నిర్మల్‌కు ఉదయం 7.50నిలకు, 8.50నిలకు, 11.15నిలకు, 12.15నిలకు, మధ్యాహ్నం 3గంటలకు, సాయంత్రం 4గంటలకు, తిరిగి నిర్మల్ నుంచి ఉదయం 9.30లకు, 10.30, మధ్యాహ్నం 1.15, 2.15, సాయంత్రం 4.45, 5.40కి బస్సు సౌకర్యం ఉంటుందని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆర్టీసీ డిలక్స్ బస్సు లక్కీడ్రా విజేతలు వీరే..

సుభాష్‌నగర్: డీలక్స్ బస్సులో ప్రయాణించిన మహిళల కోసం ఆర్టీసీ 15 రోజులకు ఒకసారి లక్కీడ్రాను ప్రవేశపెట్టింది. శుక్రవారం నగరంలోని ప్రధాన బస్టాండ్‌లో లక్కీడ్రా తీశారు. నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లలో ప్రయాణించే మహిళా ప్రయాణికుల కోసం ఈ లక్కీడ్రాను ఏర్పాటు చేశారు. శుక్రవారం విజేతలో మొదటి విజేత విజయలక్ష్మి (పెద్దపల్లి), సౌజన్య (ఆర్మూర్), వసంత (కమ్మర్‌పల్లి) నిలిచారు. వీరికి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ మేనేజర్ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో-1 మేనేజర్ ఆనంద్, అసిస్టెంట్ మేనేజర్, ఎస్‌టీఐ సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ స్టేషన్‌లో ఫర్నిచర్ అందజేత



ఫర్నిచర్ అందజేస్తున్న జీజీ ఫౌండేషన్ అధ్యక్షుడు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 9: పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫర్నీచర్ అందజేశారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆఫీస్ టేబుల్, వీల్‌చైర్, విజిటర్ చైర్‌లను జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్ ట్రాఫిక్ సీఐ రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిజే దయానంద్, బోచ్‌కర్‌వేణు, జెస్సు ఆనంద్, బెల్దారి శ్రీనివాస్, కాశీనాథ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: ఇటీవల ఐడిసిఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికైన తారాచంద్ నాయక్ శుక్రవారం నగరంలోని దుబ్బరోడ్‌లోగల ఐడిసిఎంఎస్ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా తారాచంద్ నాయక్ ఐదు రోజుల క్రితం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన సాంబారి మోహన్‌పై స్థానిక సొసైటీలో అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ఆయన పదవిని కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇటీవల చైర్మన్ పదవి కోసం ఎన్నికలు నిర్వహించగా తారాచంద్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఇతర నాయకులు తారాచంద్ నాయక్‌ను అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. 71 మంది లబ్ధిదారులకు 18లక్షల 19వేల రూపాయలను పంపిణీ చేశారు. తన క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి విడతగా చెక్కులు వచ్చాయని ఆయన తెలిపారు. ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకునేవారు తన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అన్ని పత్రాలను అందజేయాలని సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుంచి, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సహాయం అందేలా తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపల్‌గా రవీందర్‌రాజు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల శ్రీజ్ఞాన సరస్వతి సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపల్‌గా రవీంధర్ రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ రాంకోటి శ్రీ త్యాగరాయ స్వామి సంగీత నృత్య కళాశాలలో కథక్ నృత్య లెక్చరర్‌గా పనిచేస్తున్న రవీందర్‌రాజు పదోన్నతిపై ప్రిన్సిపల్‌గా వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న సరిత పెద్దపల్లి జిల్లా మంతనికి బదిలీపై వెళ్లారు. సంగీత పాఠశాలలో సీనియర్ హిందుస్తానీ శిక్షకురాలిగా ఉన్న అనితకు వరంగల్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన నూతన ప్రిన్సిపల్‌కు సంగీత పాఠశాల సిబ్బంది స్వాగతం పలికారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, ఆగస్టు 9: కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలన్న మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో వర్నిచౌరస్తాలోగల అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం మొత్తం కలుషితమవుతుందని మొక్కలు నాటడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. జనాభ పెరుగుతున్నందువల్ల మానవజాతి మనుగడకై ప్రమాదం ఉందని తెలిపారు. పట్టణాల్లో నానాటికి కాలుష్యం పెరుగుతుందని అన్నారు. ప్రతిపౌరుడు బాధ్యతగా చెట్లను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్‌మీన, డివిజనల్ అధికారి సుధాకర్ రావు, ఎఫ్ఆర్‌వోలు సంజయ్‌గౌడ్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

స్వచ్ఛతతోనే ఆరోగ్యం : డీఎల్‌పీవో శ్రీనివాస్

ధర్పల్లి: స్వచ్ఛతతోనే ఆరోగ్యంగా ఉంటామని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5 నుంచి ప్రారంభమైన కార్యక్రమం ముగిసినట్లు ఆయన తెలిపారు. నాటిన ప్రతి మొక్కనూ రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రివ్యూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఏపీవో వినోద, ఏపీఎం సునీత, కాంగ్రెస్ నాయకులు చెలిమెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాటిన మొక్కలను కాపాడుకోవాలి..

సిరికొండ: గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకోవాలని పంచాయతీ ప్రత్యేక అధికారి వినయనాయక్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు మానవ మనుగడను కాపాడుతాయన్నారు. గ్రామాలు శుభ్రంగా ఉంటేనే ఎలాంటి అంటు రోగాలు రావన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సయ్యద్ ముగ్దుం, డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం, హేమంత్, అటవీ శాఖ సిబ్బంది, కారోబార్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

● అడిషనల్ కలెక్టర్ అంకిత్



యంత్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

బోధన్‌రూరల్, ఆగస్టు 9: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని పలు వార్డులతో పాటు ప్రభుత్వ విభాగాలను పరిశీలించారు. బోధన్ తాగునీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. వర్షకాలంలో ఎక్కడా పైప్‌లైన్ లీకేజీ లేకుండా చూడాలని అన్నారు. అనంతరం శక్కర్‌నగర్‌లోని బస్తీదవాఖానాను పరిశీలించి అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆయన అన్నారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. పట్టణంలోని డంపింగ్ యార్డులో గల తడిచెత్త, పొడిచెత్త నూతన యంత్రం విభాగాన్ని పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జయకుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

జిల్లాలో భారీగా ఎస్సైల బదిలీ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో భారీగా ఎస్సైల బదిలీలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికలముందు సుదీర్ఘకాలంగా ఉన్న వారిని ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు బదిలీలు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద స్థాయిలో జిల్లాలో ఎస్సైల బదిలీలు జరిగాయి. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న వారికి వివిధ స్టేషన్లకు బదిలీ చేయగా కొత్తగా ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి జిల్లాలో పోస్టింగ్‌లు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో జరిగిన బదిలీలలో సీపీ కల్మేశ్వర్ తన ముద్రను చూపించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
యాసర్ అరాఫత్	వెయిటింగ్	రెండవ టౌన్, నిజామాబాద్
ఎల్.రామ్	రెండవ టౌన్, నిజామాబాద్	రికొండ ఎస్‌హెచ్‌వో
జి.రమేష్	ఎస్‌హెచ్‌వో సిరికొండ	సిసిఎస్, నిజామాబాద్
ఎల్.ప్రవీణ్	మూడవ టౌన్ నిజామాబాద్	బోత్, ఎస్సై, ఆదిలాబాద్
కె.శ్రీకాంత్	వెయిటింగ్	నాల్గవ టౌన్, నిజామాబాద్
బి.సంజీవ్	నాల్గవ టౌన్, నిజామాబాద్	ట్రాఫిక్ ఎస్సై, నిజామాబాద్
కె.వెంకట్రావ్	వెయిటింగ్	ఐదవ టౌన్ ఎస్సై నిజామాబాద్
టి.యాదగిరి	ఎస్‌హెచ్‌వో నవీపేట్	ఎస్‌హెచ్‌వో మోపాల్
కె.వినయ్‌కుమార్	ఎస్‌హెచ్‌వో వేల్పూర్	ఎస్‌హెచ్‌వో నవీపేట్
ఎం.నాగనాత్	ఎస్‌హెచ్‌వో బోధన్ రూరల్	ఎస్‌హెచ్‌వో వేల్పూర్
ఎం.రాజశేఖర్	ఎస్‌హెచ్‌వో కమ్మర్‌పల్లి	ఎస్‌హెచ్‌వో బోధన్ రూరల్
సి.అనిల్‌రెడ్డి	ఎస్‌హెచ్‌వో మోర్తాడ్	ఎస్‌హెచ్‌వో కమ్మర్‌పల్లి
ఏ.హరిబాబు	భీంగల్ ఎస్సై	ఎస్‌హెచ్‌వో నందిపేట్
జి.మహేష్	నిజామాబాద్ రూరల్	భీంగల్ ఎస్సై
మహ్మద్ ఆరీఫ్	విఆర్ జగిత్యాల్	నిజామాబాద్ రూరల్ ఎస్సై
ఎం.గంగాధర్	ఎస్‌హెచ్‌వో మోపాల్	ఆర్మూర్ టౌన్ ఎస్సై
పి.సంజీవ్‌రావు	వెయిటింగ్	మహిళా పోలీస్ స్టేషన్ నిజామాబాద్
విక్రమ్ భూపల్లి	ఎస్‌హెచ్‌వో ధర్పల్లి	టౌన్-1 ఎస్సై-1, నిజామాబాద్
జె.రామకృష్ణ	సిసిఎస్ జగిత్యాల్	ఎస్‌హెచ్‌వో ధర్పల్లి
జి.నారాయణ	వెయిటింగ్	ఎస్‌హెచ్‌వో మెండోరా
హబీబ్‌ఖాన్	వెయిటింగ్	బోధన్ టౌన్ పిఎస్ ఎస్సై-2
కె.బాబురావు	ఎస్‌బిటి, నిజామాబాద్	నిజామాబాద్ రూరల్ ఎస్సై-2
కె.నర్సయ్య	సిఎస్‌బి నిజామాబాద్	నిజామాబాద్ మూడవ టౌన్ ఎస్సై-2
ఆర్.లక్ష్మయ్య	వెయిటింగ్	నిజామాబాద్ ఐదవ టౌన్ ఎస్సై-2
ఎం.సత్యం	పిసిఆర్ నిజామాబాద్	డిచ్‌పల్లి ఎస్సై-2
బి.ఉదయ్‌కుమార్	వెయిటింగ్	నిజామాబాద్ నాల్గవటౌన్ ఎస్సై-2
ఎం.విఠల్‌రావు	వెయిటింగ్	సిసిఎస్ నిజామాబాద్
డి.దేవకుమార్	వెయిటింగ్	సిసిఆర్‌బి నిజామాబాద్
జి.హన్మాండ్లు	విఆర్ నిజామాబాద్	రెండవ టౌన్ ఎస్సై-2 నిజామాబాద్
కె.చంద్రమోహన్	వెయిటింగ్	సిసిఎస్ నిజామాబాద్
వి.రజినీకాంత్	ఎస్‌హెచ్‌వో కుంటాల	ఎస్‌హెచ్‌వో ముప్కాల్
సిహెచ్ భాస్కరచారి	ఎస్‌హెచ్‌వో ముప్కాల్	ఎస్‌హెచ్‌వో కుంటాల
జి.అప్పారావు	ఎస్‌హెచ్‌వో రుద్రూర్	ఎస్‌హెచ్‌వో బజార్‌హత్నూర్, ఆదిలాబాద్
బి.రాము	బోత్ పిఎస్, ఎస్సై-1	ఎస్‌హెచ్‌వో ఏర్గట్ల
జె.మచ్చేందర్	ఎస్‌హెచ్‌వో ఏర్గట్ల	బోధన్ టౌన్ ఎస్సై-1
బి.నరేష్	ఎస్‌హెచ్‌వో బజార్ హత్నూర్	ఎస్‌హెచ్‌వో బాల్కొండ
మహ్మద్ షరీఫ్	భైంసా టౌన్ పిఎస్ ఎస్సై-1	నిజామాబాద్ టౌన్-1 ఎస్సై-2
ఉదుత మహేష్	డిచ్‌పల్లి ఎస్సై-1	మూడవ టౌన్ ఎస్సై-1 నిజామాబాద్
జె.రామారావు	నిజామాబాద్ రూరల్ ఎస్సై-2	వీఆర్, నిజామాబాద్
కె.పాండేరావు	ఐదో టౌన్ ఎస్సై-2 నిజామాబాద్	వీఆర్, నిజామాబాద్

నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఆగస్టు 9: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడిఈ తోటరాజశేఖర్ తెలిపారు. నగరంలోని తిలక్‌గార్డెన్ ఉపకేంద్రం పరిధిలో ఉదయం 10గంటల నుంచి 12.30ల వరకు ఆర్టీసి బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి కాంప్లెక్స్, స్టేషన్ రోడ్, రాష్ట్రపతి రోడ్, దేవిరోడ్ చౌరస్తా వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. వర్షం కురిస్తే పనిచేయడం జరగదని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

గంజాయి పట్టివేత : ఒకరి అరెస్టు

సుభాష్‌నగర్, ఆగస్టు 9: గంజాయి సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 455 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తెలిపారు. నగరంలోని ఖిల్లారోడ్ చౌరస్తాలో ఉదయం 11గంటల సమయంలో ఎండు గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు షేక్ అబ్దుల్ సమర్‌ను తనిఖీలు నిర్వహించగా అతని వద్ద 455 గ్రాముల ఎండు గంజాయి దొరికిందని తెలిపారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలిప్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు మత్తు పదార్థాలు అమ్మిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాల అమ్మకంపై సమాచారం తెలిస్తే 87126588973 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై మల్లేష్, సిబ్బంది షబ్బీర్ ఉద్దీన్, ప్రభాకర్, సంజయ్, ధర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర దిష్టిబొమ్మ దహనం

పెద్దబజార్, ఆగస్టు 9: దేశాన్ని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెట్టే బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా ఇన్‌చార్జి వి.ప్రభాకర్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఓమయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు శివ మాట్లాడుతూ.. గత నెలలో కేంద్ర ప్రభుత్వం తరఫున పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని ఈ బడ్జెట్ కార్మిక రైతు వ్యతిరేక బడ్జెట్‌గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, దేవరాం, సురేష్, గంగారాం, వెంకటేశ్, కంజర భూమయ్య పాల్గొన్నారు.

నగరంలో ఆహార కల్తీపై సర్వే

సుభాష్‌నగర్, ఆగస్టు 9: ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టడానికి వివిధ శాఖల అధికారులతో ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నట్లు వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందూరు బిసి సంక్షేమ కార్యాలయంలో కల్తీ సర్వే పై పోస్టర్లను ఆవిష్కరించారు. పాలలో కల్తీ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా అవుతున్న ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాలో లోటుపాట్లపై సర్వే నిర్వహించనుందని తెలిపారు. నిజామాబాద్ జిల్లానే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఆహార కల్తీ వల్ల ప్రమాదాలు సంపూర్ణ పౌష్టిక ఆహారం ఆవశ్యకత, కల్తీలేని ఆహార పదార్థాల ధృవీకరణ క్వాలిటీ సింబల్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా మహిళా సంక్షేమ అధికారి రసూల్‌బీ విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ పరంగా అంగన్‌వాడి సెంటర్ల ద్వారా సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు వి.ఎన్.శర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు మహదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, గడప రవి, తదితరులు పాల్గొన్నారు.

'డబ్బులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సిరికొండ, ఆగస్టు 9: సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుంచి ఖర్చుల పేరుతో రూ.19లక్షలు డ్రా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు నర్సయ్య శుక్రవారం విచారణ అధికారి పోచయ్యను కోరారు. 2023 వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఖర్చుతో సంఘం ఖాతా నుంచి రూ.19 లక్షలను డ్రా చేశారన్నారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పీఏసీఎస్ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆమోదం

సిరికొండ, ఆగస్టు 9: సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) క్యార్యదర్శి మహ్మద్‌అలీని సస్పెండ్ చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి చేసిన సిఫారసుకు అనుగుణంగా సంఘం ఆమోదించింది. పరపతి సంఘంలో రుణాలు పొందిన రైతుల జాబితాను రెండు నెలలు ఆలస్యంగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయడం వల్ల 132 మంది రైతులు రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీకి అర్హులు కానందుకు బాధ్యులుగా కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డీసీవో సహకార సంఘం పాలకవర్గానికి డైరెక్షన్స్ ఇచ్చింది. డీసీవో ఇచ్చిన సిఫారసుకు అనుగుణంగా సిరికొండ సహకార పరపతి సంఘం పాలక వర్గం ఆమోదించి సస్పెన్షన్ చేస్తున్నట్లు అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు నర్సయ్య ప్రకటించారు.

రైతులను రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఆగస్టు 9: రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని త్వరలో కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రభుత్వం తీసుకువస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కలిగోట్ గ్రామంలో పుట్ట శివాలయంలో నాగమపంచమి సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి చెరువులు నిండి పంటలు పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని దేవున్ని వేడుకున్నానన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటి పథకాలు అమలవుతున్నాయన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మూడు విడతల్లో రైతుల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేస్తుందన్నారు. రెండు విడతల్లో లక్ష నుంచి లక్ష 50వేల వరకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఈనెల 15వ తేదీలోగా రూ.2లక్షల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేస్తున్నారన్నారు. రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందాల్సి అవసరం లేదన్నారు. సాంకేతిక సమస్యల వల్ల కొందరి రైతులకు రుణమాఫీ రాలేదన్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి తప్పకుండా ఆ రైతులకు రుణమాఫీ చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేవరాజుల గంగాధర్, శ్రీనివాస్, నాయకులు ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, కలిగోట గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

పెద్దబజార్, ఆగస్టు 9: కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేసి దళితులను ఆదుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.ఆర్.శివప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంబేద్కర్ అభయహస్తం పేరుమీద 12లక్షల రూపాయలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఇళ్లులేని దళిత కుటుంబాలకు ఇండ్లను మంజూరు చేయాలని అన్నారు. మాల మాదిగ కార్పొరేషన్ పేరుమీద కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్పొరేషన్‌లకు సంవత్సరానికి 700 కోట్లు ఇవ్వాలని, సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్‌కు 1000 కోట్లు విడుదల చేసి దళిత యువకులకు ఉపాధి కల్పించాలని అన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేయాలని కోరారు. షాద్‌నగర్‌లో దళిత మహిళలపై జరిగిన సంఘటనను పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు సందీప్‌కుమార్, ప్రతాప్, బాలకృష్ణ, సంజీవ్, కెప్టెన్ రాజు, పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ మోర్చా నాయకులు

ఘనంగా యువజన కాంగ్రెస్ దినోత్సవం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 9: జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విక్కీయాదవ్, యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రీతమ్, ముదస్సీర్, విపుల్ గౌడ్, ఇర్ఫాన్, నరేందర్, శుభం, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,300	రూ.66,600	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డి) (10.00, 7.30)
: శివం భజే (1.00) : కల్కి (3.45)
: మురారి (10.30)
స్క్రీన్-2 : కమిటీ కుర్రాళ్లు (1.00, 7.25, 10.40)
: రాయన్ (4.15)
స్క్రీన్-3 : కేస్ నంబర్-15 (11.30)
: పాగల్ వర్సెస్ పాగల్ (1.55)
: సింబా (4.25)
: భవనమ్ (7.10, 10.10)
స్క్రీన్-4 : కమిటీ కుర్రాళ్లు (11.40)
: సంఘర్షణ (2.55) : లాండ్ మాఫియా (5.20)
: ఆలియా బసూ గయాబ్ హై (హిందీ) (8.10)
: తుఫాన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కమిటీ కుర్రాళ్లు (10.50, 4.35, 7.40, 10.40)
: తుఫాన్ (1.50)
స్క్రీన్-2 : మురారి (10.15)
: భవనమ్ (1.35)
: కల్కి (తెలుగు) (4.20)
: తుఫాన్ (7.40)
: రాయన్ (10.30)
స్క్రీన్-3 : మురారి (12.15, 3.40, 7.10, 10.35)

దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
: రాయన్ (6.15, 9.15)
నటరాజ్ : భవనమ్ (11.00, 2.00, 9.00)
: మురారి (6.00)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15)
: మురారి (9.15)

- నిజామాబాద్ అర్బన్